# రహదారుణాలు

- ఛిద్రమవుతున్న రోడ్లు
- వాహన చోదకులకు ఇక్కట్లు



కోటికేశవరం వద్ద గోతులమయంగా రోడ్డు



రాఘవపురం సమీపంలో కంకర లేచి ప్రమాదకరంగా రహదారి

**మధురపూడి: అక్కడక్కడ రోడ్డు.. అంతా గుంతలే. రాళ్లు తేలిన రహదారిలో ప్రయాణం నరకమే.** రాజానగరం నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఇదే తంతు. తారు రోడ్లు అత్యంత అధ్వానంగా మారాయి. భారీ వాహనాలు అధిక లోడ్‌తో వెళ్తుండటంతో రోడ్లన్నీ ఛిద్రమవుతున్నాయి. క్వారీలు, స్టోన్ క్రషర్ వాహనాల కారణంగా ఈ పరిస్థితి దాపురించింది. రాజానగరం నియోజకవర్గంలోని మూడు మండలాల్లో 72 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. దాదాపు తారు రోడ్లన్నీ జిల్లా పరిషత్, రోడ్లు భవనాల శాఖ అధీనంలో ఉన్నాయి. వీటి ఆలనాపాలన చూసేవారు లేక ప్రయాణం దినదిన గండంలా మారింది. ప్రధానంగా కోరుకొండ మండలం కోరుకొండ–రఘుదేవపురం వయా కోటికేశవరం, కోరుకొండ- గండేపల్లి వయా గాదరాడ, బూరుగుపూడి– రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడు, బూరుగుపూడి- రాజానగరం వయా దోసకాయలపల్లి తదితర రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. మైనింగ్ తరలిస్తున్న భారీ వాహనాల రాకపోకల కారణంగా రోడ్లన్నీ దారుణంగా మారుతున్నాయి. భారీ గోతులు, పైకి రేగిన కంకరతో దర్శనమిస్తున్నాయి. ద్విచక్ర వాహనచోదకులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇసుక, గ్రానైట్, కంకర ఓవర్ లోడ్‌లో వాహనాలను నడపడంతో గోతులు ఏర్పడుతున్నాయి. ఇటీవల గోతుల కారణంగా రాఘవపురం కాలువ వద్ద ఆటో బోల్తా పడింది. కోటికేశవరం సమీపంలోని టర్నింగ్ వద్ద, శ్రీరంగపట్నం సూరంపాలెం కాలువ వద్ద రోడ్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి.

**భారీ వాహనాలతో..**

సీతానగరం మండలం నుంచి ర్యాంపు ద్వారా గోదావరి ఇసుకను కోరుకొండ మండలంలోని గ్రామాల నుంచి తరలిస్తున్నారు. బుచ్చెంపేట, మధురపూడి, కోటికేశవరం గ్రామాల మీదుగా ఈ వాహనాలు వెళ్తున్నాయి.

పుష్కర, పోలవరం కాలువలకు ఆనుకున్న గ్రామాల్లో క్వారీల నుంచి క్రసర్ కోటికేశవరం, గరగలంపాలెం, బొల్లెద్దుపాలెం, బూరుగుపూడి జంక్షన్ మీదుగా తరలిస్తున్నారు. ఈ అధిక లోడు వాహనాల రాకపోకలతో రోడ్లు దారుణంగా తయారవుతున్నాయి.

### ఓవర్‌లోడ్‌ను నియంత్రించాలి



భారీ వాహనాల్లో ఓవర్ లోడ్‌ను నియంత్రించాలి. దీనివల్ల రోడ్లు గుంతలమయంగా మారుతున్నాయి. అధికారులు పరిమితికి మించి సరకు రవాణాకు అనుమతులు ఇవ్వకూడదు. గ్రానైట్, కంకర వాహనాలు వేగంగా వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల కోటికేశవరంలో భారీ వాహనాలను నిలిపేశాం. ప్రత్యామ్నాయ మార్గాల్లో ఈ వాహనాలు వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ముడే సింధూ దివ్య, సర్పంచ్, కోటికేశవరం

### టోల్ ఫీజు వసూలు చేయాలి



భారీ వాహనాలను నిర్వహిస్తున్న యజమానుల నుంచి టోల్ వసూలు చేయాలి. వాహనాల యజమానులంతా కూటమి ప్రభుత్వానికి చెందిన నాయకులు కావడంతో నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు. ఓవర్‌లోడ్ వాహనాలు నడపడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

–గణేశుల పోసి, రైతు నాయకుడు

### ప్రమాదాలకు చెక్ పెట్టాలి



భారీ వాహనాలు వెళ్తున్న రోడ్లలో ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలి. దానికి అనుగుణంగా ప్రమాద ప్రదేశాలు, టర్నింగ్‌లు, కాలువలు, ఎత్తయిన ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి సమస్యలను పరిష్కరించాలి.

–పసుపులేటి బుల్లియ్య నాయుడు, కోరుకొండ

## సాగునీటి సంఘాల చైర్మన్ పదవికి నోటిఫికేషన్



సీతానగరం తహసీల్దార్ కార్యాలయంలో పోలవరం ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ సరళా వందన

**సీతానగరం:** తొర్రిగడ్డ పంపింగ్ స్కీమ్ పరిధిలోని నాలుగు సాగునీటి సంఘాలకు చైర్మన్ పదవికి ఎన్నికల అధికారి, పోలవరం ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ ఎస్.సరళావందన బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. బుధవారం సీతానగరం తహసీల్దార్ కార్యాలయంలో నోటిఫికేషన్ విడుదల చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ నెల 21న పురుషోత్తపట్నం, చినకొండేపూడి, రఘుదేవపురం, మునికూడలి సాగునీటి సంఘాల చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నికుంటారన్నారు. అదే రోజు ఫలితాలు వెల్లడిస్తామన్నారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, జలవనరుల శాఖ ఏఈ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.







## క్లుప్తంగా

### మోటారు సైకిల్ రికవరీ

**సీతానగరం:** ఉండేశ్వరపురానికి చెందిన మాకాల సూరిబాబు తన మోటారు సైకిల్ కనిపించడం లేదని బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిని పట్టుకుని మోటారు సైకిల్ రికవరీ చేశామని హెడ్ కానిస్టేబుల్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. రాత్రి తన ఇంటి వద్ద ఉంచిన మోటారు సైకిల్ కనిపించకపోవడంతో సూరిబాబు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో అదే గ్రామానికి చెందిన బండారు రామును గ్రామ శివారున అరెస్ట్ చేసి, మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నామని, అతన్ని కోర్టులో హాజరుపర్చుతామని హెడ్ కానిస్టేబుల్ వివరించారు.

### ఇంటర్న్‌షిప్‌నకు 197 మంది ఎంపిక



ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు

**రాజానగరం:** స్థానిక గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులలో 197 మంది ప్రముఖ ఆటోమోటివ్ తయారీ సంస్థ 'లూకాస్ టీవీఎస్'లో ఇంటర్న్‌షిప్ చేసేందుకు ఎంపికయ్యారని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్ తెలిపారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆ విద్యార్థులందరికీ ఇంటర్న్‌షిప్‌కు సంబంధించిన పత్రాలను అందజేసి, అభినందించారు. ఇంటర్న్‌షిప్ ద్వారా నైపుణ్యాలను పెంపొందించుకుని, సమాజానికి ఉపయోగపడే విధంగా కొత్త ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎంఎస్ శర్మ మాట్లాడుతూ ఎంపికైన ఈ విద్యార్థులంతా ఆరు నెలలపాటు ఇంటర్న్‌షిప్ చేస్తారని, ఆ సమయంలో ఉచిత భోజన సదుపాయాలతో పాటు నెలకు రూ. 12 వేల ఉపకార వేతనంగా అందజేస్తారన్నారు. జీజీయూ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, హెచ్‌ఓడీలు డాక్టర్ డి.రవికిశోర్, పి.వెంకట్రావు, వి.సుబ్రహ్మణ్యం, నిర్మలాదేవి, ప్లేస్‌మెంట్ అధికారి కె.వల్లీమాధవి తదితరులు పాల్గొన్నారు.

### రెవెన్యూ సదస్సుకు 11 అర్జీలు

**సీతానగరం:** మునికూడలిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 11 అర్జీలు వచ్చాయి. బుధవారం తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో భూ సమస్యలపై పలు అర్జీలను రైతులు అందించారు. ఫ్యామిలీ మెంబర్, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్లు, సర్వే నంబరు తప్పుగా నమోదైందని, అడంగల్‌లో పేరు తప్పుగా పడిందని ఒక్కొక్క అర్జీ చొప్పున అధికారులు అందుకున్నారు. అదే విధంగా పొలాన్ని సర్వే చేయాలని మూడు, పట్టాదారు పాస్‌బుక్‌లు కావాలంటూ మూడు అర్జీలను రైతులు అందించారు. డిప్యూటీ తహసీల్దార్ మూర్తి, ఆర్ఐ నవీన్, మండల సర్వేయర్ గౌతమ్, ఎండోమెంట్ ఈఓ పాటి సత్యనారాయణ, వీఆర్వో కుమారి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

### కనకదుర్గమ్మ జాతర

**మధురపూడి:** గాదరాడ దుర్గానగర్‌లోని కనక దుర్గమ్మ జాతర మహోత్సవం బుధవారం జరిగింది. ఆలయ ధర్మకర్త తోరాటి రాంబాబు ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. మహిళలు కుంకుమ పూజలు చేశారు.

### రీ సర్వే రద్దు చేయాలి

**మధురపూడి:** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రీ సర్వేను రద్దు చేయాలని సర్పంచుల సమాఖ్య మాజీ అధ్యక్షుడు, రైతు నాయకుడు అడపా సుధీర్ అన్నారు. కోటికేశవరంలో రెవెన్యూ సదస్సు వద్ద విలేకరులతో ఆయన మాట్లాడుతూ రీ సర్వే సక్రమంగా లేదన్నారు. దీనివల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అవసరమైతే రీసర్వే రద్దు కోసం ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

### ఘనంగా అన్నసమారాధన

**సీతానగరం:** చినకొండేపూడిలో అభయాంజనేయ స్వామివారి ఆలయం వద్ద బుధవారం అన్నసమారాధన జరిగింది. ఇక్కడి నాలుగు బొమ్మల సెంటర్ వద్ద అభయాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 13 నుంచి స్వామివారికి పూజా కార్యక్రమాలతో శ్రీహనుమాన్ వ్రత మహోత్సవాలు ప్రారంభించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి శ్రీస్వామివారి ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిపారు. సుమారు మూడు వేల మంది భక్తులు పాల్గొన్నారు.

### పారిశుధ్య కార్మికుడికి గాయాలు

**పెదపూడి:** స్కూల్ బస్సు ఢీకొనడంతో పారిశుధ్య కార్మికుడు గాయాలపాలయ్యాడు. ఎస్సై శ్రీను నాయక్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. అనపర్తి వివేకానంద విగ్రహం సమీపంలో రహదారిని ఈ నెల 16వ తేదీ ఉదయం పారిశుధ్య కార్మికులు శుభ్రం చేస్తున్నారు. వారిలో వి.ఈశ్వరరావు అనే కార్మికుడిని అటుగా వచ్చిన ఒక ప్రైవేటు స్కూల్ బస్సు ఢీకొంది. ఎటువంటి హార్న్ కొట్టకుండా బస్సును డ్రైవర్ నడపడంతో ఈ ప్రమాదం జరిగింది. గాయాలపాలైన ఈశ్వరరావును తోటి కార్మికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## విధి నిర్వహణలో అంకితభావంతో మెలగాలి



దేవిడ్ రాజు దంపతులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

### మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

**పెదపూడి:** విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ అంకితభావంతో మెలగాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తి గ్రామం ఐటీసీ(ఐఎల్‌టీడీ)లో ఆర్‌డీఎస్‌ఎఫ్‌ఎల్ డ్రైవర్లుగా పనిచేసి పదవీ విరమణ పొందిన 8 మందికి సన్మాన సభను బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో నిస్వార్థ సేవలందించే వారు ప్రజల నుంచి ఆదరణ పొందుతారన్నారు. అనంతరం పదవీ విరమణ పొందిన సత్తి గంగిరెడ్డి, పాదూరి డేవిడ్‌రాజు, గంగులూరి సబ్బారావు, కచ్చా ఏసు, నందికోళ్ల గంగరాజు, మెండె వీరబాబు, చుక్కా వెంకటేశులు, బండారు సుబ్బారావు దంపతులను మాజీ ఎమ్మెల్యే దంపతులు ఘనంగా అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో సత్కార గ్రహీతల కుటుంబ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

## మర్రిపూడిలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

**రంగంపేట:** మండల పరిధిలోని మర్రిపూడి గ్రామంలో గత రెండు రోజులుగా పారిశుధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ వేము మాధవి ఆధ్వర్యంలో గ్రామంలోని పలు వీధులలోని డ్రెయిన్లలో పారిశుధ్య కార్మికులు పూడికను తీస్తున్నారు. దీంతో మురుగునీరు వీధుల్లో నిల్వ ఉండకుండా బయటకు పోతుందని, తద్వారా దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయని సర్పంచ్ మాధవి అన్నారు. పూడికను ట్రాక్టర్ సహాయంతో గ్రామ శివారు ప్రాంతాలకు తరలిస్తున్నామని తెలిపారు. అంటు వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.



పూడిక తీస్తున్న పారిశుధ్య కార్మికులు

## గృహ హింస నివారణ చట్టాలపై అవగాహన

**సీతానగరం:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గృహ హింస నివారణ చట్టంపై అవగాహన సదస్సు బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డిస్ట్రిక్ట్, హైకోర్టు అడ్వకేట్ ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ కుటుంబంలో భార్యభర్తలు గాని, బంధువులు గాని ఎవరి వల్లనైనా మానసిక, శారీరక, ఆర్థిక విఘాతం కలిగితే, దానిని గృహహింస అంటారని తెలిపారు. స్త్రీలు ధైర్యంగా తమ సమస్యలను చెప్పి ఆర్థికంగా కూడా తమ నష్టాన్ని తిరిగి పొందవచ్చని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు మాట్లాడుతూ గృహ హింసపై సరైన అవగాహన ఉంటే న్యాయం పొందవచ్చన్నారు. మహిళా సాధికారిక శాఖ కన్వీనర్ డాక్టర్ సుధామయి, నాగేశ్వరరావు, మాధవ్, సుబ్బారావు పాల్గొన్నారు



సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టిబాబు

## ముగిసిన శిక్షణ తరగతులు



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణ రెడ్డి



బిక్కవోలు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్



రాజానగరంలో శిక్షణలో పాల్గొన్న సర్పంచులు, కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు

**పెదపూడి:** సుస్థిర గ్రామాభివృద్ధిపై రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయని అనపర్తి ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి తెలిపారు. అనపర్తి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడుతూ ప్రకృతిలో లభించే వనరులను పొదుపుగా వినియోగించాలన్నారు. వాటి వినియోగం తగ్గించడానికి అవసరమైన ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలన్నారు. తద్వారా భవిష్యత్ తరాలకు ప్రకృతి వనరులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**స్వచ్ఛ గ్రామాల అవతరణకు కృషి చేద్దాం**

సుస్థిర గ్రామాల అభివృద్ధే లక్ష్యంలో భాగంగా గ్రామాలను పచ్చదనంతో పరిశుభ్రంగా తయారు చేయడానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బందికి సుస్థిర గ్రామాభివృద్ధి కార్యాచరణపై రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి పట్టుకొమ్మలైన పల్లెలు పచ్చదనంతో ఆరోగ్యకరంగా ఉండటానికి వ్యక్తిగత, సామాజిక శుభ్రత అవసరమన్నారు. ప్రకృతిలో లభించే వనరులను అవసరాలకు మాత్రమే పొదుపుగా వాడుకొని భవిష్యత్ తరాలకు దాచి ఉంచాలనేదే కార్యక్రమం ఉద్దేశమన్నారు. ఎంపీడీఓ కొప్పూరి నరేంద్రరెడ్డి, సచివాలయ కార్యదర్శులు యాళ్ల ఉమామహేశ్వరరావు, మన్యం శ్రీనివాస్ చౌదరి, కనక నాగేంద్రకుమార్, బి.ప్రసన్నకుమార్, ఏపీఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

**20న శిక్షణ కార్యక్రమం**

**బిక్కవోలు:** మండలంలోని బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా కార్యక్రమం ఉంటుందని ఎంపీడీవో వి. శ్రీనివాస్ బుధవారం తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 6 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. మండలస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొంటారని తెలిపారు.

**గ్రామాల అభివృద్ధిపై ముగిసిన శిక్షణ**

**రాజానగరం:** గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని ఎంపీడీఓ, రిసోర్స్‌పర్సన్ ఝాన్సీ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనం, వెలుగు కార్యాలయంలో మండలంలోని గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందికి 'గ్రామ పంచాయతీ సుస్థిరాభివృద్ధి ప్రణాళిక' అనే అంశంపై రెండు బ్యాచ్‌లుగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. గ్రామాల్లో రోడ్లు, డ్రెన్లు, తాగునీటి సదుపాయాలు, విద్యుత్ సమస్యలు వంటి వాటిని పరిష్కరించే దిశగా పటిష్ట ప్రణాళికలను తయారు చేయడం ద్వారా అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమానికి ఏఓ సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్డీ వై.వాణి, కొత్త తుంగపాడు పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు.

**అభివృద్ధిలో భాగస్వాములు కండి**

**బిక్కవోలు:** గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రణాళికాబద్ధంగా పని చేస్తూ గ్రామాలను అభివృద్ధి పథంలో నిలపాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులకు ఇస్తున్న శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సుస్థిర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగాలన్నారు. ఎల్ఎస్‌డీఎస్ పథకం, ప్రజారోగ్య లక్ష్యాలు, హెల్దీ విలేజ్, చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్, సురక్షిత మంచినీరు తదతర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జాన్ మిల్టన్, ట్రైనర్లు సూరిశెట్టి సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.